క్రిస్ట్ మస్ బహుమతి

క్రిస్ట్ మస్ ఇంకా వారం రోజులుంది. తూర్పు సర్కిల్ ప్రాథమిక బాల బాలికా పాఠశాల మొదటి తరగతి విద్యార్థులందరు తమ మేష్టరమ్మకు ఏవైనా బహుమతులు ఇవ్వాలి ఈ క్రిష్టమస్‌కి అని ఉబలాట పడ్డారు. కాని పంతులమ్మ దీన్ని గురించేమీ ఆలోచించనేలేదు అసలు. ఎందుకంటే, హాజరుపట్టీ తిరగేస్తే కనపడే చాలామంది వాకబ్‌లు, రకేల్సు, ఇసివోర్లు మొదలైన వాళ్ళకి క్రిస్టమస్ రోజుకి - మామూలు రోజుకి ఏమీ భేదం లేదని తేలిపోయింది. కనక ఆమె వీటి నేమీ పట్టించుకోకుండా ఉండిపోయింది.

అయితే, మిగతా పిల్లలందరు కలిసి పంతులమ్మ యెడ కనపర్చే ప్రేమనంతా తను ఒక్కడే ఒలకపోస్తున్న మారిస్ మాఖిలోవస్కీ దగ్గిర పంతులమ్మ కివ్వడానికి - బహుమతిగా ఏమీ లేదు. తనకన్న తక్కువగా - నిజమే - పంతులమ్మగారి యెడ వాత్సల్యలేశం వున్న ఇస్టారో విష్‌లెస్కీ, సాడికానో రావస్కీ, ఫిండర్ బెర్తా, వీళ్ళందరి ప్రేమలూ ఏదో ఒక వస్తురూపంగా మారి తన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేస్తున్నై. నిజంగా తనూ, తన ప్రేమని క్రియా రూపంలో చూపించలేక పోవటాన్ని ఆ లేత మనస్సు భరించలేకుండా వుంది. ఇదే జాసలో అతను నిజంగా దిగులు పడ్డాడు. అతని మనోవ్యధని ఒక రకంగా గుర్తించి పంతులమ్మ అతన్ని ఉషారుపర్చటానికి, సంతోషంగా వుండడానికి చేసిన ప్రయత్నాలన్ని, తన నిజమైన వ్యధని పంతులమ్మతో తెలియజెయ్యక పోవటం వల్ల ఆ పసివాడికి పిచ్చెత్తించినాయి.

అతను పంతులమ్మని ఎట్లా ప్రేమించాడు? ఆమెను మొదట చూసినప్పుడు ఆ పసివాడు ఎంతో భయపడ్డాడు. ఆ తర్వాత ఇప్పుడో? ఆమె వాడి హృదయంలో ఒక దేవతగా మాతృస్థానాన్ని ఆక్రమించుకున్నది. మూడేళ్ళ క్రితం - ఆ రోజు అతని కెంతో జ్ఞాపకం వుంది.

ఆ వేళ వాళ్ళమ్మ వాడి ప్రాణం తీసి నీళ్ళు పోసింది. తర్వాత ఆ ఎర్రటి బడికి తీసికెళ్ళింది. బయటనుంచి చూసిన ఆ భవనం వాడికి ఇదివరలో పరిచయమే. కాని, దాని లోపలి భయంకరాలు వాడికి తెలియవు.

వాడు దుమ్ము నిండిన బూట్సుకాళ్ళతో ఆ బళ్ళోకి ప్రవేశించి అన్ని గదులూ దాటి భీతితో తన క్లాస్ రూములోకి ప్రవేశించాడు. తన తల్లి వెళ్ళిపోయింది. ఒక పెద్ద కుర్రాడు వాణ్ణి చెయ్యి పుచ్చుకుని లాక్కుపోయి, మెల్లిగా కూచోటం ఎట్లా, బూట్లు విప్పడం ఎట్లా అని చెప్పి ఒకచోట కూర్చోబెట్టాడు. తనను, 'కేరినీ' అని పిల్చాడతను.

తనని చూచి తన భయం చూచి క్లాసులో పిల్లలు గొల్లుమని నవ్వారు. ఆ చిన్ని హృదయం గాయపడింది. క్రూరమృగాలున్న అడవిలో ఉన్నట్టు 'ఫీల్ అయి గొల్లున ఏడ్చాడు. కాళ్ళు - చేతులూ తన్నుకున్నాడు.

అప్పుడే మొట్టమొదటిసారిగా - తను ఇప్పుడు చాలా ఇష్టపడే, ఆ గొంతును పరిచయం చేసుకున్నాడు. ''ఏం అబ్బాయి? అట్లా ఏడవచ్చా? తప్పుకదా?'' అంటూ నేలమీద కూర్చొనివున్న తన్ను లేవదీసింది ఆమె.

ఆ చెయ్యి ఏంతో మృదువుగా వున్నది. గొంతు కూడా ఎంతో ఆప్యాయంగా వినిపించింది. వీటితో కూడా సన్నని సువాసనకూడా కలిసి తన మొహాన్ని కప్పుకున్న చేతిని తీసేసుకునేట్టు చేసింది. ఏడ్చి ఏడ్చి ఎర్రబడ్డ కళ్ళతో తనపక్కనే కూర్చుని వున్న ఆ 'పెద్ద' అమ్మాయిని చూశాడు. ఆ పెద్ద ఆకారాన్ని జాగ్రత్తగా పరిశీలించాడు ఆ అబ్బాయి - మొదట బూట్సులవంక తర్వాత పూలగౌను వంక, ఆ తరవాత మొహంవంక, ఇంకా నమ్మకం కుదరని చూపుతోనే. కాని ఆ పంతులమ్మ కళ్ళల్లో ఆ పసివాడి భయకంపిత నేత్రాలకి ఆదరణ లభించింది. అవి అక్కడే నిలిచి పోయ్యాయి.

ఆమె, మారిస్‌ని రెండు చేతుల్తో ఎత్తుకుని గుండెల్లో హత్తుకుంది. వాడి ఏడ్పు, ఎక్కిళ్లు తగ్గాక మెల్లిగా అడిగాడు - ''నేను ... చిన్నవాణ్ణి కాదూ? మా అమ్మ ఏదీ?'' అని.

ఆ తరవాత తన కష్టాలు ఏకరువు పెట్టి ఎలాగో ఓ లాగున ఆ రోజున తన జీవితంలో మొదటి బడి రోజును గడిపాడు.

అక్కణ్ణించీ బడికి అందరికంటె ముందుగా హాజరయ్యేదే అతను, చివరికి పొయ్యేదీ అతనే. పంతులమ్మగారి ప్రేమాదరాలతో అతని విద్యే కాక, ఆనందం, వాత్సల్యం క్రమంగా అభివృద్ధి కాసాగాయి. పంతులమ్మపట్ల వాత్సల్యమే అన్నిటికన్న పై అంతస్తులో వుంది ఇప్పుడు. మిగతా పిల్లలందరూ పంతులమ్మకు ఆశ్చర్యం కలిగించే విధంగా బహుమతు లివ్వడానికి ప్లానులు వేస్తూవుంటే, అతని హృదయం నిండుగా వాత్సల్యపూరితం ఐనా, చేతులు మాత్రం ఖాళీగా ఉండి బాధపడవల్సి వచ్చింది. అమ్మతో చెప్పి చూశాడు సమాధానం ''అలాంటిదేమీ పనికిరాదు'' అని తేలింది.

''నీకెందుకురా ఈ గొడవ? నాన్నకి తెలిస్తే కోప్పడతారు'' అంది అమ్మ.

మారిస్ మొండిగా ''మిగతా పిల్లలందరూ పంతులమ్మగారికి బహుమతులు ఇస్తూన్నారే...'' అని సణిగాడు. తనకి పంతులమ్మంటే ఎంత ప్రేమో వివరించడం ఆ కుర్రాడికి మాటల్లో సాధ్యంకాకుండా వుంది.

''సరె, సరే... ఏం కొనటానికీ మన దగ్గర డబ్బు లేదు. నాన్నకి డబ్బు ఎక్కువ దొరుకుతుందేమో ననే భయం ... నాన్న యజమాని'' .. ఆ పైన ఆమె మాట్లాడలేక కొడుకుని కావలించుకుని

భోరునఏడ్చింది. కనక మారిస్‌కు వేరే దారిలేదు. అమ్మా నాన్నా బీదవాళ్ళు. ఇవి పంతులమ్మకి తెలుస్తాయా!

ఇవ్వాళ ఆ క్రిస్టమస్‌కి ముందురోజు శుక్రవారం ఉదయం బడి అంతా అల్లరిగా, ఆనందంగా ఉంది. ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉండే ఆ 18వ నంబర్ క్లాస్ రూమ్ గూడా, ఒకళ్ళతో ఒకళ్ళు గుసగుసలాడే శబ్దాలతోనూ, కొత్త గుడ్డలు నలిగే ధ్వనితోనూ నిండివుంది. అంతా గందరగోళం, రంగురంగులు దుస్తులు ధరించి బంతులల్లేగెంతే పసివాళ్ల ఆనందం కోలాహలంతో అంతా శోభాయమానంగా ఉంది. వాళ్ళ చేతుల్లో ఏవేవో పొట్లాలుగూడా వున్నై. కొత్తవాళ్ళు రాగానే పాత వారంతా వాళ్ళ మీదికి ఎగబడి వాళ్లు ఏం బహుమానం తెచ్చారో చూసేదాకా రగడ.

పంతులమ్మ తన శిష్యులవైపు ఆశ్చర్యంగా చూస్తూ వుంది. పిల్లలు ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? ఇంత కొత్తగా విచిత్రంగా కనుపడుతున్నారేమిటి; ఒక్క రాత్రిలోగా ఎంతో పెద్దవాళ్ళుగా మారిపోయినట్టు కన్పిస్తున్నారేమిటి? ఇదంతా చూస్తూంటేపంతులమ్మకి నవ్వొచ్చింది. ఇంతలో, ఈగోల అంతటికన్న పెద్దగా కీచుగా ఓ ఆర్తనాదం వినిపించింది. రెండు డస్కుల మధ్య రెండు తన్నుకుంటున్న కాళ్ళు కన్పించినాయి. పంతులమ్మ పరిగెత్తింది విడిపించటానికి. ఆకాళ్ళ బ్రౌను రంగు మేజోళ్ళవల్ల, పచ్చపూల గౌనుతోను ఆపిల్ల 'బెర్తా' అని ఊహించింది ఆమె. కాని తీరా చూస్తే ఇంకో లావాటి అమ్మాయి అని తేలింది. బెర్తా సన్నగా వుంటుంది. తర్వాత విచారిస్తే, బెర్తా తొడిగే 'డ్రస్సు' ఓ ఫాష నయిందట!

పంతులమ్మ గూడా రోజుకన్న అందంగా కనపడుతోంది. మొట్టమొదటగా పంతులమ్మ గారికి 'కానుక' సమర్పించటానికి వచ్చింది ' ఇస్టార్' అనే అబ్బాయి. నవ్వుతూ కొవ్వొత్తి అమర్చే పింగాణీ స్టాండుతో అతను టేబిల్ దగ్గిర నుంచి లేచి వచ్చాడు. ఈ నీలం కలిసిన తెలుపు పింగాణీ స్టాండు తన కేనని పంతులమ్మ మొదట ఊహించలేక పోయింది అసలు?

ఇస్టార్ తన చేతిలో బహుమతిని టేబిల్ మీద పెట్టి ''రేపు సెలవుగదండీ! మీ మీద మాకు చాలా ప్రేమ గదండీ!... అందుకని ఈ బహుమతి తెచ్చాం ఈ స్టాండు ఇరవై సెంట్లు ఖరీదుటండీ!''

''అబద్ధం అండి మేస్టారు! పది సెంట్లకి మూడుదొరుకుతై'' అని ఇంకో కీచుగొంతు అరిచింది. కాని పంతులమ్మ గారు ఇస్టార్‌ని సమర్థించి '' అవును, కొనవచ్చు - కాని, ఈ స్టాండు నలభైసెంట్లు ఖరీదు కూడా ఉండవచ్చు. ఇదే నాకు కావాలి. నువ్వు మంచి బహుమతి తెచ్చావు ఇస్టార్!'' అన్నది.

ఇస్టార్ తనబల్ల దగ్గిరికి తిరిగి వెడుతూ, ''అంతా రావొచ్చు'' అన్నాడు. అంతే - మొదటి తరగతి పిల్ల లందరూ ఒక్కసారి గల్లంతుగా వొచ్చి పంతులమ్మగారి టేబిల్ ముందు నెట్టుకుంటున్నారు. ఎవరు తెచ్చిన బహుమతులు వారు తాము ఇవ్వాలంటే తాము ఇవ్వాలని తోసుకు రాసాగారు. అంతేగాదు. పంతులమ్మ గారిని కావులించుకుని ఊపిరాడకుండా చేస్తున్నారు.

నాదన్ ఓ కప్పు - సాసర్ సెట్ తెచ్చాడు. ఇంకో అబ్బాయి మూడేళ్ళనాటి పెద్దబొమ్మల కేలండర్‌ని బహుమతిగా తెచ్చాడు. ఒక బాటిల్ సెంటు, ఓ సిల్క్ రుమాలు పెట్టిన అందమైన చిన్న బుట్టని అందించాడు 'సారా'. ఇంకో అబ్బాయి ఫౌంటెన్ పెన్ను పెట్టె, పసుపుపచ్చ గుండీ తెచ్చాడు.

మళ్ళీ ఓ ఏడ్పుగొంతు వినిపించింది. పంతులమ్మ పరిగెత్తుకువెళ్ళి క్లాస్‌రూమ్ తలుపు తీసింది. అక్కడ ఓ అమ్మాయి విచారంతో నిలబడివుంది. ఆమె జుట్టు రేగివుంది. ఆమె చేతిలోవున్న బంగారు గిల్టుపూసిన సాసర్‌ని గుండెలకు అదుముకుని ఏడుస్తోంది.

''ఎందుకమ్మా ఏడుస్తున్నావ్ యివాళ?'' అని పంతులమ్మ చాలా దయగా అడుగుతూ ఆ చిన్నమ్మాయిని క్లాస్ రూమ్‌లోకి తీసుకొచ్చింది. ఈవా ఏడుస్తూ తను తెచ్చిన కప్పు సాసర్‌లలో కప్పుని ఓ పెద్దకుర్రాడు లాక్కుపోయి నాడు అని చెప్పింది. ఈవా ఏడ్పు పంతులమ్మ ఓదార్పు మాటలతో కొంచెం తగ్గింది. జాకబ్ అనే అబ్బాయి పంతులమ్మగారికి తాబేటి బుర్రతో చేసిన దువ్వెన బహుమతిగా పట్టుకొచ్చి దాన్ని పంతులమ్మ జుట్టులో అందంగా పొదిగి ''ఇది ఇరవై సెంట్లు అయిందండీ!'' అని చెప్పి వెళ్ళాడు.

ఇంతలో ఇంకో పెద్దకుర్రాడు తొందరగా లోపలికి వచ్చాడు. వాడు పద్దెనిమిదివ నెంబరు రూము కుర్రాడు కాదు. అయినా వాడికి పంతులమ్మగారు చాలా రోజుల్నించీ పరిచయం. అందుకని వాడూ ఓ బహుమతి తెచ్చాడు. క్రిస్టమస్ అభివందనాలు చెప్పాక తను తెచ్చిన అందమైన బంగారు కప్పును బల్లమీద పెట్టాడు. ఇంతలో ఈవా, ''వీడేనండి - నా కప్పు లాక్కుపోయాడండి! అదే నా కప్పు'' అని క్లాస్ రూమ్ అదిరిపోయ్యేటట్టు కేక పెట్టింది. పంతులమ్మగారిపని ఇరుకున పడింది. కాని ఆ కుర్రాడి వ్యవహారం తేలిక. '' అబద్ధం'' అని మొండివాదన వాడిది. కప్పూ సాసరూ ఒకేజత అని నిరూపించబడినా గాని వాడివాదన మానలేదు.

ఈ మధ్యలో బహుమతులిచ్చే వాళ్లు యిస్తూనే ఉన్నారు. సాసర్లూ, కప్పులూ, రిబ్బన్లూ, సబ్బులూ బల్లనిండా సందులేకుండా ఉన్నాయి. వాటిని చుట్టి తెచ్చి కాయితాల్ని ఓ పక్కగా పొయ్యటానికే ఓ కుర్రాడికి సరిపోతుంది. నిజానికి ఇంకే పంతులమ్మకి ఆ రోజు ఇన్ని బహుమతులు వచ్చి వుండవు. వాళ్ళు పిల్లలపట్ల యింత వాత్సల్యంగా ఉండలేదు గూడాను.

పంతులమ్మగారికి ఇదొక గొప్ప విజయమే ననాలి. గందరగోళం ఒక్కరవ్వ తగ్గింది. ఇంతలో పంతులమ్మగారు మోకాలిమీద ఓ చిన్న చేయి వాలింది. ''మేష్టారూ! నేనూ ఓ బహుమతి తెచ్చానండి మీకు!'' అని సన్నని సుపరిచిత స్వరం వినిపించింది. పంతులమ్మ తిరిగి చూసింది. మారిస్ బటనులు లేని చొక్కాతో కనిపించాడు. అదే వాడి మామూలు దుస్తులు.

''నాకు నువ్వెందుకు బహుమతి తెచ్చావ్ మారిస్!... మనిద్దరం స్నేహితులమేగా!...'' అని ప్రారంభించింది పంతులమ్మ.

'' అవును మేష్టారు! మీరు నన్నెంతో ప్రేమిస్తున్నారు. నేను మిమ్మల్ని ఎంతో.. దాన్ని ఎట్లాగండి చెప్పడం? అందుకోసం బహుమతి తెచ్చా!'' అన్నాడు మారిస్... ఇంకా చెప్పుకు పోతున్నాడు. '' నా దగ్గిర సబ్బు లేదు. సెంటు దొరకలేదు. స్టోర్‌నించి మా అమ్మ ఏమీ తేలేదు. కాని మేష్టారు! మీకు ఓ మాంచి బహుమతి తెచ్చానండీ! '' అని ముగించాడు.

'' అదేమిటి బాబూ! ఇలాతే..'' అని చాలా వాత్సల్యంతో అడిగింది పంతులమ్మ.

''మేష్టారు! ఇదిగోనండి... ఇదేమిటోనాకు తెలీదు. యిదేమిటో తెలుసుకోవాల్సినంత పెద్దవాణ్ణి కానుకదండీ! కాని యిది అబ్బాయిలకి కాదుటండి! ఆడ వాళ్ళకేనట. నిన్నరాత్రి నాన్న అమ్మకి ఈ బహుమతిని - యిచ్చాడు. అమ్మ దీన్ని తీసుకుని సంతోషపడింది. కళ్ళ నీళ్ళు కూడా పెట్టుకుంది మేష్టారు! నాన్న గూడా సంతోషించాడు. అమ్మ అన్నదిగదా, 'చాలా సంతోషం' అని దీన్ని చూసినప్పుడల్లా చాలా సంతోషపడిందండి! నాకు సబ్బు దొరకలేదండి!'' అన్నాడు.

''అది సరేబాబు! మీ అమ్మ నాకివ్వమని చెప్పిందా?'' అని కనుక్కుంది పంతులమ్మ.

''లేదండి మేష్టారు! అమ్మకి తెలీదు. కాని ఇది ఆడవాళ్ళకేటండి - నా దగ్గిర సబ్బులేదు మీరే చూడండి దాన్ని! అది ఆడవాళ్ళకేనట?''

మారిస్ తనలాగు జేబునించి ఓ రోజారంగు కాయితాన్ని పంతులమ్మ కందించాడు. పంతులమ్మ దాన్ని చదివేటప్పుడు ఆమె కళ్ళల్లో సంతృప్తికోసం ఆశా మారిస్ ఆమె వేపే చూస్తూ నుంచున్నాడు. ఆమె చదవటం పూర్తిచేశాక వాడివంక చూసినప్పుడు, మళ్లీ వాడు, ''అది ఆడవాళ్ళకేటండి! నాకు సబ్బు దొరకనే లేదండి'' అన్నాడు-అమాయకమైన స్వరంలో

''కాని మారిస్!'' అని పంతులమ్మ విషాదంగా, కళ్ళ నీళ్ళ పర్యంతమైన చిరునవ్వు నవ్వుతూ పిలిచింది. ''ఇది సబ్బుకంటే గొప్ప బహుమతి! సెంటుకన్న చాలా గొప్పది మారిస్ ! మంచిది గూడా ! ఇది ఆడవాళ్ళకేలే - నాకు ఇంకెవ్వరూ ఇలాంటి బహుమతి ఇవ్వనేలేదు!'' అన్నది ఆమె ఉద్రేక పూరితంగా.

మారిస్ గర్వంగా ''మా నాన్నగూడా ఇట్లాగే అంటాడు'' అనేసి కుర్రాళ్ళతో కలిసి కోరస్ పాట పాడ సాగాడు.

మిగతా కాలాన్ని చాలా ఉత్సాహంగా ఆవేళ ఏమీ జరగనట్టే గడిపాడు. సాయంత్రం మూడుగంటలకు పంతులమ్మగారి దగ్గిర సెలవు తీసుకుంటూ ''ఏమండీ! మీరు ఈవాని మాత్రం ముద్దెట్టుకుంటారు గదా! నన్నెప్పుడూ ముద్దు పెట్టుకోరేమండీ?'' అని అడిగాడు సహజంగా.

''అది మగపిల్లలకు దొరకదు మారిస్!'' అంది పంతులమ్మ నవ్వుతూ

''ఈ బహుమతి ఇచ్చినందుకైనా నన్ను ముద్దెట్టుకోవాలండి మేష్టారు!'' అని మారిస్ మారాం చేశాడు.

★ ★ ★

ఆవేళ రాత్రి పంతులమ్మ తన ఇంటిలో కూర్చుని తన కొచ్చిన బహుమతుల్ని లెక్క వేస్తూంది. అవి ప్రేమాస్పదమైనవి. ఆశపడదగ్గవి, కాని వాటి అన్నిట్లోకి మారిస్ ఇచ్చిన బహుమతిని పంతులమ్మ చాలా ఆశతో మళ్ళీ ఓసారి చూసింది, అది ఒక కుటుంబంలోని భార్య, భర్త, పిల్లాడు ముగ్గురి సంతోషానికి హేతువైన బహుమతి. దాన్నే '' ఇది ఆడవాళ్ళకు మాత్రమేటండి'' అని మారిస్ క్రిస్టమస్ బహుమతిగా ఆమెకిచ్చాడు. అదేమిట్లో తెలుసా? అది ఒకరసీదు. మనోవీధిలోని ఒక ఇంటిలోని బైటగదికి అద్దె ముట్టినట్టు ఇవ్వబడిన రశీదు!

('మైరాకెల్లి' రచన ఆధారంతో)

('రక్తస్పర్శ' కథల సంపుటి, 1963)